కథానిక




'శ్రీ వాత్సవ'

"ఏముండి బాబూ! గోదావరిలో 'లాంచీ' మునిగిపోయిందట విన్నారా? నిన్న సాయంకాలం ఈ రేవునించి అద్దరికి వెళ్లే 'లాంచీ' అట! మా పెద్దమ్మాయి యీ మాట విన్నప్పటినించీ బెంగ పెట్టుకుంది పోనా! చూడడానికి వచ్చిన దాని పెనిమిటి తీరా మోసి నిన్న సాయంకాలం లాంచీకే వెళ్లాలా? రాత్రికి ఉండి తెల్లారుజామున స్టీమరుకు వెళ్లమని చెప్తూనే వున్నాను; తెల్లారేటప్పటికి కచ్చేరీకి వెళ్లితీరాలని పరుగెత్తాడు. ఇంతకీ అత నీ పాటికి ఇంటికి లక్షణంగా చేరకొనే ఉంటాడు మా అమ్మాయి ఆదుర్దాగాని!

'దీని జబ్బు నిమ్మళించింది, యింక వారం రోజులలో వెళ్లిపోవచ్చునని డాక్టరుగారంటున్నారు ఏదో చూడటానికి వచ్చాడా అతను; ఈ రెండురోజులూ అతన్ని చూచి దీనికీ సంతోషంగానే ఉంది, ఖులాసాగా తిరుగుతోంది, సంతోషం సగం బల మని, బాగానే తిరుగుతోంది; ఎవడు చెప్పాడో ఈ అఘాయిత్యపు మాట, లాంచీ మునిగిపోయిందని అప్పటినుంచి నా ప్రాణాలు కొరుక్కుని తింటోంది.

'అతనికేమీ నిక్షేపరాయుడిలాగ యీపాటికి చేరుకుంటాడంటే వినిపించుకోదే! ఈ మునిగిపోయిన లాంచీ ఏదోగాని, బొబ్బర్లంక "లాంచీ" పెద్దస్టీమరు అది మునిగిపోవటం ఏమిటి నా మొఖం! అంత పెద్ద లాంచీ మునిగిపోతే, ఊరూ వాడా గప్పుమనిపోదూ?

దీని చాదస్తం కాని అతనికే ప్రమాదం లేకుండా హాయిగా ఉంటాడు రేపి పాటికి క్షేమంగా చేరినట్టు ఉత్తరమూ వస్తుంది.

అతనికి టెలిగ్రాం కొట్టమంటుంది, నేనెక్కడ చావనమ్మా?

ఆడదాన్ని ఎక్కడికి అఘోరించనూ? ఆ పోస్టాఫీసు ఎక్కడుందో ఎలాగ వెళ్లాలో, ఏమని టెలిగ్రాం కొట్టాలో? నా కేం తెలుస్తుంది? ఈ అడవిలోంచి ఎక్కడికి వెళ్లను? ఇందాకటినించి వేపించుకొని తినేస్తుంది? పోనీ మీయింట్లో మగవా రెవరైనా కాస్త అలాగవెళ్లి టెలిగ్రాం పంపిస్తారేమో" అని వచ్చాను అని దీర్ఘాలు తీసుకొంటూ బుచ్చెమ్మగారు చెబుతున్నారు. ఇది జరుగుతూవున్న దృశ్యం రాజమండ్రిలోని హాస్పటలు ఆవరణలో. అక్కడికి రకరకాల దీర్ఘవ్యాధులు నిమ్మళింప చేసుకోవడానికి రోగులు వచ్చి విడిదిచేసి ఉన్నారు వందలకొద్దీ రోగులకి తగిన వసతులు లేక పర్ణకుటీరాలలోనే శిబిరాలు వేశారు. ఒకొక్కక్క రోగితో ఒక కుటుంబం ఆడవాళ్లు మగవాళ్లు, పెద్దవాళ్లు పిన్నవాళ్లు అన్నిరకాల రోగులూ ఉన్నారు వాళ్లకి సంరక్షణచేసి పెట్టడానికి వెంటవచ్చిన వాళ్లు, వంటచేసేవాళ్లు, సహాయం ఉండేవాళ్లు, వాళ్లపిల్లలు, వెనుక పెద్దఆసరాలు ఇలాగ చాల జనాభా చేరారు. అదొకచిన్న అగ్రహారంలాగు ఉంది

అలాగ. గర్భసంబంధమైన వ్యాధికంటే అది నిమ్మళింప చేయడానికని పెద్దమ్మాయి రామలక్ష్మిని యీ హాస్పటలులోకి తీసుకొని వచ్చింది బుచ్చెమ్మగారు. అల్లుడికి అమలాపురం తాలూకా కచ్చేరిలో గుమాస్తాపని భార్యను చూడటానికి శని, ఆదివారాలు వచ్చి, ఆదివారం సాయంకాలం స్టీమరుకు వెళ్లిపోతూడు రేపు దాటితే రాత్రికి యింటికి ఖుశాసాగా చేరిపోవచ్చుని.

అతనేమో ఆదివారం సాయంకాలం స్టీమరుకే వెళ్లాడు ఇంతలో యెక్కడినించి పుట్టిందో ఈనీలివార్త పుట్టింది గోదావరిలో లాంచి మునిగిపోయిం దని అది ఊరంతా వ్యాపించి చిరరికి ఊరు చిట్టచివర ఉన్న యీ హాస్పిటలు శిబిరంలోకూడా చేరుకుంది అసలు వార్త చిలువలు, పలవలు పెరిగి అనేకరకాల వ్యాఖ్యానాలతో ఆడవాళ్ల నోళ్లల్లోబడి ఆ వార్త అనేక రూపాంతరాలు పొందుతూ ఉంది

బుచ్చెమ్మగారు ఉపన్యాస ధోరణియూ, మళ్లీ యింకొకళ్లు మాటలాడడానికి అవకాశం యివ్వకుండా లాంచీప్రమాదం సంగతి చెబుతోంది. ఎవరినైనా, తన అల్లుడిపేర టెలిగ్రామ్ యివ్వడానికి బ్రతిమాలా లని ఆ ఉపన్యాసం చివర ముక్తాయింపు ఆమె మాటలాడుతూ ఉంటే, కూతురు రామలక్ష్మి కూడానే ఉంది. అంతా అయిపోనిచ్చి, "భయమో! ఏమో! ఒక్క టెలిగ్రామ్ యిస్తే ఏం పోతుంది? ఆ కాస్త క్షేమం తెలిస్తే కొంచెం కుదుటబడి" అని చిన్న గొంతుకతో గారంగా రామలక్ష్మి అంది.

"అయితే అయింది, ప్రాణంకంటేనా? టెలిగ్రామ్ కొట్టించండి ఆ యమ్మాయి అంతగా యిదవుతుంటే! డబ్బుకోసం చూచుకొంటే యెలాగ? ఏమోమరి- క్షేమవార్త తెలిసేవరకు మనస్సు ఆరాటంగానే ఉంటుంది" అని ఒక పకురావిడ అంది నేనుమాత్రం డబ్బుకి వెనక్కి చూస్తున్నానా? ఇంత ఖర్చుఅక్కరగా లేనిది యీ రెండు రూపాయలకి చూస్తా నేమిటి? నా కేం తెలుసు. ఆ టెలిగ్రామ్ ఏమిటో? పోస్టాఫీసు ఏమిటో? ఎప్పుడైనా యిలాంటి పాటులు పడ్డానా? చేశానా? ఆడదాన్ని ఎక్కడికి చావను అని?"

"మావారు బజారుకి వెళ్ళారు పోనీ అలాగే పంపిస్తను" అని ఒక యిల్లాలు పెదవి విరిచేసినది 'ఇంకో ప్రక్క రాజులబ్బాయిని అడిగితే అతలికా టెలిగ్రామ్ యివ్వడ మేమిటో అసలే తెలియదన్నాడు. పోనీ ఆశాస్త్రిలుగారిని అడుగుదా మని వస్తే ఆయన ఊరికి వెళ్లారట" అని మళ్ళీ బుచ్చెమ్మగారు మొదలుపెట్టింది ఇదంతా మేము చూడటానికి వెళ్లిన శిబిరం ముందే జరుగుతోంది అంతగా వ్యాకపడుతూ ఉంటే, పోనీ సాయం చేద్దామని "నే నలాగ బజారు వైపు వెళ్తానులెండి నేను ఇస్తాను ఆ టెలిగ్రామ్" అని వివరాలూ అవీ తెలుసుకున్నాను. రెండు రూపాయలు సొమ్ముకూడా ఆమె చేతిలో పెట్టా.

"మా నాయన! మీ కెంతయినా పుణ్యముంటుంది! ఈ టెలిగ్రామ్ కొట్టి అతని క్షేమం వెంటనే తెలియజేయమని వ్రాయండి.. ఏమే అమ్మాయి నా ప్రాణాలు తీశావు—ఇప్పటికి నీ మనస్సు కొంచెం శాంతించిందా? సమయానికి దేవుడులాగ వచ్చాడు ఈయన యెవరో?" అంటూ వెళ్లిపోయింది ఆవిడ; వెంట ముసిముసినవ్వులతో తన పంతం నెగ్గించుకున్నా నన్న సంతోషంతో ఆ కూతురూ వాళ్ళ పాకలోకి వెళ్లిపోయింది.

నేను బజారులోకి వెళ్లి ముందు టెలిగ్రామ్ పని చూచి ఈ నీలివార్త యెంతవరకు నిజ మని యిద్దరు ముగ్గురుని వాకబు చేశాను. ఏవళ్లూ యీ సంగతి విన్నట్టు మాటాడలేదు. కథకు కాళ్ళు ఉంటాయా? నీలివార్త పుట్టినదంటే దానికి పూర్వాపరసందర్భా లుంటాయా? గోదావరిలో ఒక లాంచి మునిగిపోయిందంటే, అందులో జనం ఉండితీరతారు: ఆ జనం కూడా రెండు పుంజీలు మూడు పుంజీలు గాక ఒక వంద మంది అయినా ఉంటారు ఇన్ని జీవాలకి ప్రమాదం జరిగితే పైకి పొక్కకుండా ఉంటుందీ? ఇటువంటి సంగతులు పోస్టాఫీసులో తెలియవు? అక్కడ ఆ మాటే ఎవరికీ తెలియదన్నారే? బండ్లగాటీ వద్దకూడా ఎవ్వరూ చెప్పలేదూ? కాఫీ హోటెలులో యీ వూసే ఎవ్వరూ ఎత్తలేదు. బస్ స్టాండువద్ద విచారించాను. అక్కడ అసలే ఎవరూ తెలియదన్నారు.

ఆవేళ సాయంకాలం ఒక జర్నలిస్టు మిత్రుడుంటే అతన్ని చూడడానికి వెళ్లాను. ఆమాటా యీమాటా చెప్పుకొంటూ, లాంచీ ప్రమాదంమాట యెత్తాను అతడు మరీ ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు. 'బొబ్బర్లంకవెళ్లే లాంచీ నిన్న సాయంకాలం మునిగిపోయిందట, ఏమాత్రమో జననష్టం కలిగిందట, అటునించి ఎవరో వైరు ఇచ్చారట, సహాయానికి ఇద్దరినించి మరో లాంచీపంపి, మిగిలిన జనాన్ని రక్షించారట' అని నేను విన్నదానికి మరికొంత కల్పించి అతనికి చెప్పాను 'ఇంత విశేషమైన వార్త, పత్రికకు పంపకుండా ఎలాగ వదలివేస్తాను'రండి కనుక్కుందాం అని యిద్దరమూ కలిసి పోలీసుస్టేషన్‌కి వెళ్లాం. అక్కడ యినస్పెక్టరుగారు వేరే చోరీకేసు సందర్భంలో పనిచేస్తున్నారట మమ్మల్ని చూచి ప్రత్యుత్థానంచేసి కూర్చోబెట్టారు "ఏమిటి? రావుగారు ఇలాగ దయచేశారు? మీ పత్రికా విలేఖరులు గాలిపోగుచేసి వార్తలు సృష్టి చేస్తారు?" అంటూ ఆయన మొదలుపెట్టాడు వెటకారంగా!

"అదేలెండి, మేము గాలిపోగుచేసి వార్తలు సృష్టిచేస్తే; మీరు ముందు వార్త ఒకటి సృష్టి చేసి దానికి గాలి పోగుచేస్తారు, అంతే తేడా?"

"బలే దెబ్బతీశారే?" అని ఇనస్పెక్టరుగారు సిగరెట్లు ఇచ్చారు.

"అయితే యినస్పెక్టరుగారూ? నిన్నరాత్రి గోదావరిలో పెద్దలాంచీ ప్రమాదం జరిగిందట, మీ కేసైనా వివరాలు తెలిశాయా."

"లేదే - గోదావరిలో ప్రమాదమా? మాకు తెలియకుండా ఉండదే అయితే నేను ప్రక్క రాజానగరం వెళ్లి యీ వేళ పొద్దున్నే వచ్చానులెండి ఒరేయ్! 798 నిన్నరాత్రి గోదావరిలో లాంచీప్రమాదం జరిగిందట మన కేసైనా రిపోర్టు వచ్చిందిరా?" అని ఇనస్పెక్టరు ఒక కేక వేశాడు"

"లేదండి బాబు" అని 798 సలామ్ పెట్టి చెప్పాడు

"నిన్నరాత్రి ఎవరిది బీటు, వాడిని అడిగి చెప్పు" అని మరోకేక వేశారు.

"రాత్రి నేనేబీటులో ఉన్నానండి, అలాంటికబు రేమీ స్టేషన్‌కి రాలేదండి బాబు" అంటూ 798 సమాధానం చెప్పాడు.

"ఇలాంటి సంగతులు మీకంటె ముందు మాకే తెలుస్తాయిలెండి" అని మా 'రావు' మరో చురకవేసి ఇనస్పెక్టరు దగ్గర సెలవు పుచ్చుకొన్నాడు.

మే మిద్దరమూ ఈమాటు గోదావరి ఒడ్డున పడవలరేవులోకి వెళ్లాం. మా పరిశోధన మాస్తే వెనకటికి మూడు నల్లకాకులు కథలా గుంది. ఒకడు కాకుల్ని వాంతి చేసుకొంటున్నాడని వదంతి లేవతీశాడట. ఏక్కడేమిటి ఫలానా వెంకయ్య మూడు నల్లకాకుల్ని కక్కడం సుబ్బన్న చూశాడట' అని కబురు. సుబ్బన్నని అడిగితే, నేను చూశానేమిటి? యింకో రెవరో చెప్పగా విన్నాను, అన్నాడు తీరా ఆ 'యెవరినో' అడిగితే నేను కాకులు కక్కడన్నానేమిటి, 'మూడు నల్లకాకులు లాంటివి కక్కాడన్నాను, అని చెప్పాడట. అలాగా యీనీలివార్తలు ఒకరు చెప్పినదానికి రెండో వారు చెప్పినదానికీ అట్టే సామ్యం లేకుండానే మారిపోతూ ఉంటాయి.

మేము పడుతూఉన్న శ్రమ అంతా వృధా క్రింద కనిపిస్తోంది; ఇదే ఇంగ్లీషులో వైల్డు గూస్ ఛేజ్ అంటారు; ఆడవిబాతువేట! గోదావరిరేవులో ఆ పడవలు లాంచీలు ఉండేచోటికి వెళ్లాం. గోదావరి మంచిపూటుగా ఉంది. ఎఱ్ఱగా మడ్డిగా ఉన్న నీళ్లు, ప్రవాహం మంచి వడిగా ఉంది.

లెక్కలేనన్ని మానులు, చెట్లు, దుంగలు దూలాలు కొట్టుకొని వస్తున్నాయి. గట్టుమీద గోదావరి వరద చూడటానికి నిలబడి కొందరుజనం పలచపలచగా ఉన్నారు. ఏదో వింత చూస్తున్నారు. ప్రమాదం చూడటానికి వచ్చినవాళ్లేమో కొంత ఆరా తీయవచ్చునని మేము సరదాపడ్డాం.

ఆ రేవులోకి దిగి ఒక లాంచీలో ప్రవేశించి, "ఏమయ్యా! సరంగూ - నిన్నరాత్రి లాంచీ ప్రమాదం జరిగిందట విన్నావా?" అని రావు అడిగాడు. ఇది పోలవరం, భద్రాచలం రేవండి, యిక్కడ అలాంటి ప్రమాదం ఏమీ జరగలేదు. అని అతడు నిక్కచ్చిగా చెప్పాడు. కాళ్ళీడ్చుకొంటూ అటు బొబ్బర్లంకరేవులోకి వెళ్లాము. డౌలేశ్వరం స్టీమరు అవతలి రేవులోకి వెళ్ళిందట. అక్కడ చిన్న పడవలు తప్ప, ఏమీ లేవు. ప్రక్కగా కొబ్బరికాయల బస్తాలు గుట్టలుగా పడి ఉన్నాయి కొబ్బరితాళ్లు, పీచునార గోదినాలు అవి వేరే యింకో గుట్టలుగా పడి ఉన్నాయి అక్కడికి వెళ్ళి ఒక చిన్నదోనె మీద ఉన్న అబ్బాయిని పిలిచి అడిగాం. వాడు చిన్నపిల్లవాడు అదిబెస్తవాడట వల చిక్కులు తీస్తున్నాడు "ఏమిరా అబ్బాయి! నిన్నరాత్రి యీ రేవులో లాంచీప్రమాదం జరిగిందట నీ కేమన్నా తెలుసా" అని అడిగాం.

'ఆ సంగతి మాకు తెల్దండి, రాత్రి మేము చేపలపట్టడానికి పోయామండి' అని అతను అన్నాడు.

ఇలాగ అయిదారుగురిని అడిగిన తర్వాత, ఒక రహదారి పడవ చేరుకున్నాం అందులో ధాన్యంబస్తాలు ఉన్నవి. టాపుమీద ఒక ముసలతను పొగాకు పాయలు తీసి చుట్టలు చుట్టున్నాడు

"ఏం సరంగుమామా! నిన్నరాత్రి లాంచీ ప్రమాదం జరిందట ఏమిటి? నిజమేనా?" అని అడిగాం.


"రాండి! రాండి యిలాగ పడవమీదకి రండి చెప్తా! చెక్కయేయ్యరా మస్తానూ!" అంటూ చెక్క వేయించాడు. మేం రహదారి పడవమీదికెళ్లాం టాపుమీద కూర్చున్నాం

"అది ఆ కొవ్వూరోళ్లు చేసిన మాయలెండి బాబు! ప్రమాదంలేదు ఏంలేదు రాత్రి పది గంటలకి యిలాంటి పడవే ఒకటి బెల్లం వేసుకుని వత్తుందంటండి! అదరినించి"

"అయితే లాంచీ కాదన్నమాట, ఇంతకీ."

(18-వ పేజీ చూడుడు)


## రు 25/- రిస్టు వాచి ఉచితం



అందమైనది. చాలాకాలం మనును. టైం సరిగా చూపును. స్విస్ తయారు. 5 ఏళ్ల గ్యారంటీ.

రౌండ్ నికిల్‌కేసు రు15/- సెంటర్ సెకండ్ రు17/-
గోల్డెన్ రు 18/- సెంటర్ సెకండ్ క్రోం రు 20/-
మిరాక్ షేప్ 4 రాళ్లు రు 20/8 గోల్డెన్ రు 25/-
7 రాళ్లు సెంటర్ సెకండ్ రు 27/- గోల్డెన్ రు 30/-
15 రాళ్ల క్రోం రు 50/- రోల్డుగోల్డు రు 60/-
వాటర్ ప్రూఫ్, షాక్ ప్రూఫ్, రేడియం డయల్ సెంటర్ సెకండ్.

15 రాళ్ల క్రోం రు 85/- రోల్డుగోల్డు రు 105/-
రెక్టాంగులర్ కర్వ్ లేదా టానూ్య
5 రాళ్ల క్రోంకేసు రు 32/- రోల్డుగోల్డు రు 40/-
7 .. .. రు 35/- .. .. రు 45/-
15 .. .. రు 60/- .. .. రు 70/-
ఫ్రింకు 15 రాళ్ల క్రోం రు 55/- రోల్డుగోల్డు రు 65/-
అలారం టైంపీసు రు 15/- మేలురకం రు 18/-

పోస్టేజి వేరు

ఒకసారి ఏ రకపు వాచీను కొన్నా రు 25/-ల ఒక తగడియారం ఉచితము.

H [illegible]AVID Co,
Post Box No 11421, Calcutta.

# రాయసము గోవిందదీక్షితులు

(10-వ పేజీ తరువాయి)

అచ్యుతప్ప నాయకుడు కావేరినదికి ఆనకట్ట (*Aniout*) నిర్మించి ధర్మకార్యముల కెక్కు లొనర్చి, క్రీ. శ. 1577 లో మధ్వస్వామి యైన విజయీంద్ర తీర్థులకు గ్రామమును దాన మొసంగెను. మంత్రాలోచన మొనర్పవలసి వచ్చి నపుడు కోటలోని లక్ష్మీవిలాస భవనమున—

"స సుతో వసుధా సుధాకరోఽసౌ
సహగోవింద మఖీందునా సభాయామ్,
సమగా దిథ తత్ర గోత్రభేదీ
సజయంతో గురుణా యథామరాణామ్."

—(*Obid*, 10. 1.)

"భూపః ప్రాపద్యతాథో సచివసుతయుతో
జాతు లక్ష్మీవిలాసం......"

—(సాహిత్య రత్నాకరము, 9. 25.)

ముదుసలియై కొమారుని జయము నపేక్షించు చున్న యచ్యుతప్పనాయకుడును, రాజ్యము నెడల ప్రభువుపట్ల భక్తివిశ్వాసములుగల గోవిందదీక్షిత మంత్రియు, యౌవనమునుండి శాత్రవకంఠ లుంఠనముచే దన బాహుకండూతిని బోగొట్టు కొనవలె నను నభిలాషముతో నున్న రఘునాథు డును, – సమావేశమగుచుండిరి. ఈ సభలలో గోవిందదీక్షిత మంత్రి శత్రుమర్దనమునకు ప్రత్యేక ముగ నొక్కొక్క రవంతున దాకవలె నని సలహా నిచ్చుచుండెడివా డట! అట్లని 'సాహిత్య రత్నాకర' మందలి (10. 24.)

"నిహతే యుధి చోళకే న్యశంకే
నిహతా ఏవ భవంతి పాండ్యకాః,
నరనాథ నిజాశ్రయస్య బాహ్వే
నయసిద్ధో న కి మాశ్రితస్య బాధః."

అను వాక్య మవగత మొనర్చుచున్నది. ఈ సలహా ననుసరించుటవలన శత్రువు లొక్కుమ్మ డిగ బ్రతిఘటించుట కవకాశము లేక వారి వ్యూహము చెదరుట తత్రాపి యోడుట దటస్థించి గోవిందదీక్షితుని పథకము నెఱవేఱుచుండెడిది.

రఘునాథభూపాలుడు మహామాత్యుడగు గోవిందదీక్షితునిపయి నెట్టి విశ్వాసము, గౌర వము, లుండి వర్తించెనో దిగ్విజయయాత్రకయి పురముపెడలుచు రాజ్యభారమునంతను గోవింద దీక్షితునిపై నుంచెనో ఆతడును రాజభక్తి పుంభావముతో రఘునాథభూపాలునకు మారుగా రాజ్యము నెటుల బాలించెనో సాహిత్య రత్నా కర మందలి (13, 84.)

"ఇతి రయా వచన మిలా బలాహితో
ధరాధురం నిజసచివే నివేశ్యచ,
సరోరుహా త్సదసి సరోష మీక్షణా
దనీకినీ మథ సమనీనహత్ క్షణాత్."

అను వాక్యము దెలుపగలదు.

ఇమ్మహామంత్రికి యజ్ఞనారాయణ దీక్షి తులు, వేంకటేశ్వర దీక్షితులు, నను కొమాళ్లే గాక లింగాధ్వరి యను నింకొక కొమారు డున్న యట్లును దెలియుచున్నది. లింగాధ్వరి వేదార్థ తత్త్వనిర్ణయము, శివసహస్రనామభాష్యము,– నను గ్రంథముల రచించి, యందు "అస్తి గోవింద యజ్వేంద్ర నాగమాంబా తపః ఫలమ్" అనునట్లు తాను గోవింద దీక్షితుని కొమారుడ నని యుల్లే ఖించెను. యజ్ఞనారాయణ దీక్షితులు సాగ్నిచి త్సర్వక్రతుయాజి. రఘునాథరాయల చరిత్ర మును సాహిత్యరత్నాకరము, రఘునాథ భూప విజయము, రఘునాథవిలాస నాటకములను గ్రంథములుగా రచించెను. రఘునాథరాయని కీతడు శిష్యుడట! ఆతనియొద్ద గావ్యనాటకా లంకారసాహిత్యములు నేర్చికొని యాతనికి గురుదక్షిణ మీయవలసియుండగా, రఘునాథ భూపాలుడే తనకు గర్ణాలంకారముల బాదాంగద కంకణముల, నిచ్చుటయే గాక తన పదకములను గూడ బహూకరించె నని" "సాహిత్యరత్నా కరము"లో నుటంకించినాడు. ఇట్టి పాండితీ శౌండుడు రఘునాథనాయని శిష్యుడ నని చెప్పి కొనుట గర్వింపదగియున్నది.

రెండవ కొమారుడగు వేంకటేశ్వరదీక్షితులు పూర్వోత్తరమీమాంసలయందును, సంగీత శాస్త్రమునను, గవితా పాటవమునను,– సర్వ తంత్ర స్వతంత్రుడు. సాగ్నిచిత్యాప్తవాజపేయ యాజి. సాహిత్య మీమాంసా కర్మాంత వార్తిక వార్తికాభరణ చతుర్దండి ప్రకాశికాదు లితని కృతులు. మహాకవివల్లభుండయిన నీల కంఠ దీక్షితుని గురూత్తము డితడు. ఇతనితో పాటు రఘునాథరాయల యాస్థానమున రత్న ఖేటదీక్షితుల కొమారుడును, విశ్వజిద్యాజి యర్ధనారీశ్వర దీక్షితుల శిష్యుడును, – ఇతని యుత్తర్యుల శిరముం దాల్చి వెలంగువాడును,– నగు రాజచూడామణి దీక్షితులు సైత ముండు చుండెను.

శ్రీనివాస దీక్షితుని సంధ్యావర్ణనా చాతు ర్యమునకు, గల్పనాప్రౌఢికి,– ప్రముదితుండయి యచ్యుత దేవరాయ లాతని 'రత్నఖేట దీక్షితు' లని బహూకరించినట్లు లవగత మగుచున్నది. ఇవ్విషయమే యజ్ఞదేవేశ్వరుడు రాజచూడా మణి విరచితమ్మగు "రుక్మిణీపరిణయ" మహా కావ్య వ్యాఖ్యానారంభమున—

"సంధ్యా సంధుక్షితాంభోదర నలికగణా
దుద్గతా సీసఖండాం,
స్తారాకారా న్నిరోద్ధుం శశిరవి కపటా
ద్భిభ్రతో రత్నఖేటౌ,
అన్యోన్యం యుధ్యమానా వుదయ చరమ భూ
భృత్ప్రివీరావితి ద్రా,
గుక్త్వా ఖ్యాతా పరాఖ్యః క్షితిపతి, వచసా
రత్నఖేటాధ్వరీతి."

అని వివరించియున్నాడు. రత్నఖేట దీక్షి తులు సంధ్యాసమయ మభివర్ణించుచు గల్పించిన కల్పనమునకు అచ్యుతప్పనాయడే మెచ్చికొని "రత్నఖేట"మను పదమును బిరుదుగా నతని కొసంగె నని తెలియందగియున్న దిగదా! ఇమ్మహాకవి శితికంఠవిజయము, భైష్మీ పరి ణయము, భావనాపురుషోత్తమనాటకము, విధి నిర్ణయము, బౌద్ధతంత్ర మథనము, వేదాంతవాదా వళి,– లోనుగాగల పెక్కెన్నియో విరచించి యున్నాడు.

గుంటూరుసీమయందలి యొక పల్లెకు జెంది, తమ ప్రతిభావ్యుత్పత్తుల కనుగుణరీతి బ్రవర్తింప నిశ్చయించి, దూరప్రాంతము లనియేని గణింపక, ద్రమిళదేశమునకుం జనిన యాంధ్ర నియోగి కుటుంబములలో గోవింద దీక్షితుని కుటుంబ మొకటి రాయసాన్వయమునకు మణిపూసవంటి కుటుంబము. ఇక్కుటుంబమున గోవింద దీక్షి తుడు, ఆతని సంతతి,– ఎనలేని విఖ్యాతి గడించి నేటికిని దారాపథంబున దివ్యజ్యోతులంబలె వెలుంగుచున్నారట.

ఇమ్మహోదారయశులకు నమోవాకములు.

---

# కొరియాలో రగులు తున్న అగ్నిప్రమాదం

(7-వ పేజీ తరువాయి)

తాను తనతో మాట్లాడి నిర్ణయించా లన్నాడు డా॥ రీ. సంప్రదింపులకే కాకుండా మర్యాద కైనాసరే అతివాద జాతీయపక్ష నాయకుడు డా॥ కిమ్‌కూనుగాని, మితవాద జాతీయనాయ కుడు డా॥ కిమికియుసిక్‌నుగాని కమిషన్ సభ్యులు చూడనైనా కూడదన్నాడు. వారు కమ్యూనిస్టులకు తోడ్పడుతున్న దేశద్రోహు లన్నాడు. వారిని కమిషన్ సభ్యులు చూసినట్లయితే అంతర్యుద్ధం కూడా రావచ్చునన్నాడు. వారు చేసిన పాపమల్లా ఏమిటంటే 1948 మే ఎన్ని కల్లో పాల్గొనలేదు. ఉత్తరప్రాంత నాయకుల్తో సంప్రతింపులు జర్పి శాంతిమార్గాన దేశైక్యత సాధించా లన్నారు.

దేశైక్యత గురించి ఉత్తర కొరియా ప్రభు త్వంతో సంప్రతించడానికి కమిషన్ సభ్యులు యత్నించడం చూసి డా॥ రీ, అతని ప్రభుత్వం క్రోధం కనపర్చింది. అటువంటి చర్చలవల్ల ఉత్తర కొరియా ప్రభుత్వాన్ని పరోక్షంగా గుర్తించినట్లవుతుందనీ అది తన ప్రభుత్వానికి సవాలనీ డా॥ రీ స్పష్టపరిచాడు. ఉత్తర కొరి యాలో కమ్యూనిస్టు ప్రతినిధులతో దేశైక్యతను గురించి రాయబారాలు జరిపినట్లయితే ప్రమాద కరమైన ఫలితాలు కలుగుతాయని కమిషన్ సభ్యులను మే 19 వ తేదీని హెచ్చరించాడు. జెన్. సి. లింబ్, కమిషన్ సభ్యులు ఈ హెచ్చరికను లక్ష్యం చెయ్యలేదు. డా॥ రీ చెప్పిన మాటల ప్రకారం తన ప్రభుత్వానికి గౌరవ ప్రతిపత్తులు తెచ్చిపెట్టడానికీ తమపని తీర్చిపెట్టడానికీ వచ్చామనుకుంటున్నాడు."

కాని విచిత్ర మేమిటంటే ఇటువంటి బెద రింపుల్తోనే దక్షిణకొరియా ప్రభుత్వం అమె రికాపై ఒత్తిడితెచ్చి సైన్యాల్ని ఉపసంహ రించకుండా చెయ్యాలనీ, అదనంగా ఆయుధ సామగ్రి తెచ్చుకోవాలనీ, పసిఫిక్ ఒడంబడిక ఒకటి తెచ్చి సైనికసంధిలో అమెరికాను బంధిం చాలనీ తలంచింది.

అమెరికాపట్ల దక్షిణకొరియాకు ఈ వైఖరికి ఒకకారణం ఉంది, కొరియాలో కమ్యూనిస్టుల ప్రాబల్యానికి అమెరికాయే హేతువని వారి అభిప్రాయం. ఇతర జాతీయపక్షవాదులతో పాటు 1945 లో అమెరికన్ సైనికవిమానంలో స్వదేశం చేరిన ప్రెసిడెంట్‌రీ మే 7 వ తేదీని ఇలా గన్నాడు; "కొరియా రిపబ్లిక్ కమ్యూ నిస్టు ప్రమాదాన్నెదిరించి ప్రాణంఒడ్డి పోరాడు తోంది. ఈ ప్రమాదం స్వయంకృతాపరాధానికి ఫలిత మేమీ కాదు. జపాన్ ఓడిపోయినప్పుడు కొరియాలో కమ్యూనిస్టులు లేనేలేరు. రష్యన్-సంధివల్ల దేశంలో సగంభాగంలో వారు ప్రవేశించారు. అమెరికన్లు అనునయ మార్గాన్ని అనుసరించినందువల్ల దక్షిణ కొరి యాలో కమ్యూనిస్టులు బలపడ్డారు."

1945 ఆగస్టులో కొరియాలో కమ్యూనిస్టులు లేరనడం చాలా వింతగా ఉంది.

సరిగ్గా డా॥ రీ ఈప్రకటన చేసినప్పుడే కొరియా పత్రికల్లో కొన్నివార్తలు విరివిగా ప్రచురిత మైనాయి. జపాన్ పరిపాలనా కాలంలో కమ్యూనిస్టుల్ని హింసలు పెట్టి కొరియన్ పోలీసుల్ని విచారణ చేస్తున్నా రన్నవి ఈవార్తలు. 1945లో దక్షిణ కొరియాలో జైళ్ళనుంచి వందలాది కమ్యూనిస్టులు విడుద లైనారు. అనేకమంది తబసులు, డా॥ రీ మాది రిగా కాకుండా దక్షిణకొరియాలో అమెరికన్లు కమ్యూనిస్టుల పట్ల కఠినంగా ప్రవర్తించా రన్నారు. కమ్యూనిస్టు ఉపద్రవానికి అమెరికాదే బాధ్యతైనందువల్ల దక్షిణకొరియానుంచి అమెరి కన్ సైన్యాలు వెళ్లిపోకూడదని ప్రభుత్వం కోరుతోంది. అమెరికన్ సైన్యాలు విడిచిపోయే ముందు కొరియన్ రిపబ్లిక్‌ను రక్షించే బాధ్యత అమెరికా వహించా లని మే 19 వ తేదీని విదే శాంగమంత్రి దేశరక్షణశాఖామంత్రీ అన్నారు.

ఈ ప్రకటనలే కాదు. 200 మిలియన్ల డాలర్ల విలువగల ఆయుధసామగ్రి నివ్వాలనీ, పసిఫిక్ ఒడంబడిక ఒకదానికి అంగీకరించాలనీ సైనిక ఒడంబడిక చేసుకోవాలనీ, దక్షిణకొరియా ప్రభుత్వం అమెరికాను కోరింది. కొరియాలో పునరైక్యతపొందిన స్వతంత్ర ప్రజారాజ్యాన్ని సంరక్షించగలరని అమెరికా బహిరంగంగా ప్రక టించాలన్నాడు డా॥ రీ.

'పునరైక్యత' అంటే తన ప్రభుత్వం ఉత్తర కొరియాపై దాడిచేసే పక్షంలో అమెరికా తోడ్పడాలని డా॥ రీ తన అభిప్రాయాన్ని స్పష్టపరిచాడు.

ఐక్యరాజ్యసమితి కిచ్చిన వాగ్దానంప్రకారం జూలై మాసంలో దేశంనుంచి తన సైన్యాలను ఉపసంహరించుకు తీరాలని అమెరికా తన స్థితి స్పష్టపరిచింది. అయితే కొన్నివందలమంది నిపు ణుల్ని శిక్షణనిమిత్తం అక్కడే ఉంచుతోంది. ఇప్పటికే సప్లై చేసిన ఆయుధసామగ్రి, అమెరి కన్ సైన్యాలు దేశం విడిచిపోయేటప్పుడు విడిచి వుళ్ళగల ఆయుధసామగ్రి 60 వేల దక్షిణకొరి యన్ సైన్యం, (ఇది లక్షకి పెంచుతున్నారు) వీరు కాక రెండులక్షలమంది శిక్షణపొంది రిజ ర్వుదళాలు, పదిలక్షలపైగా ఉన్న యువక సంఘాలు కలిసి దేశరక్షణకి చాలడమే కాదు అధికంకూడా నని అమెరికన్ సైనికోద్యోగుల అభిప్రాయం. (ఉత్తరకొరియాలో లక్షా 30 వేల సైన్యం ఉందని అంచనా) "దేశరక్ష ణకి తగిన బందోబస్తు చెయ్యకుండానే ఇక్క మిలియన్లకొద్దీ డాలర్లు ధారపోస్తున్నా మను కొంటున్నారా?" అన్నాడొక అమెరికన్ రాయబారోద్యోగి. అయితే దక్షిణకొరియా దౌర్జన్య విధానంవల్ల మాత్రం అమెరికన్ విదే శాంగశాఖకు ఆదుర్దా కలుగుతోం దన్నాడు. సరిహద్దు సంఘర్షణల్లో చాలావరకు బాధ్యత దక్షిణకొరియా, ప్రభుత్వానిదేననీ, దక్షిణ కొరి యాకు ఇంకా సహాయం చెయ్యవలసిన అవ సరాన్ని అమెరికా గ్రహింపుకు తేవాలనే ఉద్దే శంతో వారు దౌర్జన్యం ప్రదర్శిస్తున్నారనీ అమెరికన్ ఉన్నత సైనికోద్యోగుల అభి ప్రాయం.

అయితే ఉభయపక్ష ప్రభుత్వనాయకుల యుద్ధనినాదాల మరుగునపడి ప్రజల శాంతి యుత దేశైక్యతా వాంఛపైకి ప్రకటితం కావడంలేదు. ప్రభుత్వానికి సంబంధించినవా రెవరితో మాట్లా డినా ప్రతివారూ ఈవాంఛనే ప్రకటిస్తున్నారు. ఫిబ్రవరి లగాయతు కొరియాపర్యటిస్తున్న ఐక్య రాజ్యసమితి కమిషన్ ఈ వాంఛ దక్షిణకొరియా ప్రజల్లో చాలా ప్రబలంగాఉందనీ బహుశా ఉత్తరకొరియాలో కూడా ఇదే నిజం కావచ్చు ననీ నివేదిస్తున్నది. దక్షిణకొరియా జాతీయ శాసనసభ సభ్యుల్లో 63 మంది, అనగా మొత్తం సభ్యుల్లో దాదాపు మూడోవంతు (వామ పక్ష వాదు లెవరూ శాసనసభలో లేరనది జ్ఞాపకం ఉంచుకోవాలి) కమిషన్‌కు ఒక విజ్ఞాపనలో అమెరికన్ సైన్యాలు దేశం విడిచిపోవాలనీ, శాంతిమార్గాన దేశైక్యత సాధించాలనీ తమ అభి ప్రాయం తెలిపారు.

శాంతిమార్గాన దేశైక్యత సాధించడానికి వివిధప్రతిపాదనలను కమిషన్ ఇప్పుడు పరిశీలి స్తున్నది. అయితే కొరియా ప్రజల్లో ఆశ ఎవ రికీ లేదనే చెప్పాలి. రష్యా అమెరికాలు సమా ధానానికి రాగలిగితే, ఆ రెండు ప్రభుత్వాలు ఉత్తరదక్షిణ అమెరికా ప్రభుత్వాలపై ఒత్తిడి తేగలవనీ ఒత్తిడితెచ్చి శాంతిగా దేశైక్యత సాధించడానికి వీలుపడుతుం దనీ ప్రజల అభి ప్రాయం.

---

# నీలివార్త

(11-వ పేజీ తరువాయి)

"లాంచీ అయితే యింక చెప్పాలా? అది పత్తంటే యీ వడిలో బ్రిడ్జీ తంబానికి తగిలిం దంటండి – ఆ దెబ్బకి వడినీరు లోపలికి రావడం మొద లెట్టిందట. పూటుపడవ మట్టం దాకా మక్కెసిందటండి. అలాగే తేల్తా, మునుగుతా పోతుందంటండి, ఆ గోదావరిలో."

"అయితే జనం ఎవరూ లేరా ఆ పడలో."

"పైజనం ఎవరూ లేరండి, అందులో మా వోళ్లే, సరంగు కళాసులు మొత్తం ఆరుగురున్నా రటండి-ఆళ్ల ప్రాణాలు మాత్రం పోతే ప్రమా దమే గాదండి. అంచేత కొవ్వూరుకు ఎలాగో కేకలుపెడితే, అక్కడనించి టెలీఫోనులో గోదారికాడికి చెప్పారంటండి. ఇద్దరినించి అపుడు ఒక లాంచీ యీళ్లకి సాయంపంపి గెంటుకొచ్చారంటండి."

"అయితే ఎవరికీ ప్రమాదం లేదంటూ?"

"లేదులెండి కాని ఈ పోన్‌కబుర్లు మాత్రం అందరినీ ఖంగారు పెట్టిందంటండి! చివరికి గింజలో బియ్యపుగింజ; "ఏమీ లేదండి" అని సరంగు చుట్టచుట్టుకోవడం పూర్తిచేసి అగ్గిరాడు వెయ్యబోతున్నాడు.

ఈ మిష చొప్పనైనా గోదావరికి వచ్చి, ఆ నిండు ప్రవాహాన్ని చూచినందుకు సంతో షించి మే మిద్దరమూ యింటికి తిరి గొచ్చేశాం.

అది నీలివార్త! ఆడవాళ్లు సంపాదించే గాలి వార్తలకీ నీలివార్తలకీ తలా తోక ఉండదు అంటారు అందుకేనేమో?

ప్రమాద మున్నా లేకపోయినా మొత్తం మీద నేను చేయవలసిన వాలంటీరు పనిచేశాను; టెలి గ్రామ్ పంపించాను ఆ తాలూకాకచ్చేరీగుమస్తా టెలిగ్రామ్ చూచి అదిరిపడి మళ్లీ ఏదో జబాబు పంపుతాడు. దానితో ఆ బుచ్చెమ్మగారికీ ఆమె పెద్దమ్మాయికీ మనశ్శాంతి కలుగుతుంది.

---

నారసింహ లేహ్యము
బంగారు చేర్చబడినది. మేహము. నిక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము —
తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.
పి. సి. ఏ. & కంపెని. పెరిదేపి-నెల్లూరు జి.
బ్రాంచి : 7 సీను మొదలివీధి. మద్రాసు.

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో. రాజమండ్రి